www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 6 అక్టోబర్ 2025



నేను యధావిధిగా పిజిఆర్ఎస్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికే పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదులు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయొచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పిజిఆర్ఎస్‌ను సోమవారం కలెక్టరేట్‌లో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

350 ఎకరాలు బీడు పెట్టేశారు..!

- నిరుపయోగంగా మారిన వట్లూరు భూములు
- రైతులకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వని సర్కార్
- 9 ఏళ్లుగా సాగు లేదు.. పరిశ్రమలూ ఏర్పాటు చేయని పరిస్థితి
- నష్టపోయిన రైతాంగం.. కోర్టు పరిధిలోకి సమస్య
- సమస్యను పరిష్కరించలేని స్థితిలో జిల్లా అధికారులు, పాలకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతుల సాగులో ఉన్న 350 ఎకరాల భూములను పరిశ్రమల పేరుతో రైతుల నుంచి బలవంతంగా లాక్కుని, చిల్లిగవ్వ పరిహారం ఇవ్వకుండా తొమ్మిదేళ్లుగా బీడు పెట్టేసిన పరిస్థితి పెదపాడు మండలం వట్లూరులో నెలకొంది. తొమ్మిదేళ్లల్లో వేల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి దెబ్బతినడంతోపాటు, ఆ భూములు సాగు చేసుకునే రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి ఏర్పడింది. సమస్య కోర్టులో ఉందన్న కారణం చూపుతూ భూములు రైతులకు ఉపయోగం లేకుండా, పరిశ్రమలు నెలకొల్పకుండా వందల ఎకరాల భూములను నిరుపయోగంగా మార్చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2016లో పెదపాడు మండలం వట్లూరు పెదచెరువు భూముల్లో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 495, 496, 497లోనూ, పెదవేగి మండలంలోని సర్వే నెంబర్ 210-29 పరిధిలో మొత్తం 350 ఎకరాలను వెమ్ టెక్నాలజీ సంస్థకు ఎపిఐఐసి ద్వారా కేటాయించారు. ఈ భూములను దాదాపు 300 మంది సన్న, చిన్న కారు రైతులు దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్నారు. రికార్డుల ప్రకారం ఇవి వట్లూరు పెద చెరువు భూములుగా ఉన్నాయి. చట్ట ప్రకారం చెరువు భూములైనప్పటికీ రైతుల స్వాధీనంలో ఉన్నప్పుడు పరిహారం చెల్లించి తీసుకోవాలి. అప్పట్లో ప్రభుత్వం అత్యంత దారుణంగా ముందుకు సాగింది. రైతులకు ఎటువంటి పరిహారం ఇవ్వకుండా భూములను లాగేసుకుంది. దీంతో రైతులు ఆందోళనకు దిగి పెద్ద ఎత్తున పోరాటం సాగించారు. ఈ క్రమంలో ఎకరాకు రూ.2.50 లక్షలు పరిహారం ఇచ్చేలా నిర్ణయించారు. తొమ్మిదేళ్లు గడిచినా ఇప్పటి వరకూ రైతులకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వలేదు. సాగుచేసుకుంటున్న భూములను ప్రభుత్వం లాగేసుకోవడంతో ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఆసరాను కోల్పోయి చితికిపోయాయి. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమిపాలైంది. అధికారంలోకి వచ్చిన వైసిపి రైతుల గురించి పట్టించుకోలేదు. పరిశ్రమ ఏర్పాటు సైతం జరగలేదు. 2022లో వెమ్ టెక్నాలజీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుని ఆ భూములను ఎపిఐఐసి స్వాధీనం చేసుకుంది. దీనిపై కొంతమంది రైతులు కోర్టుకు వెళ్లారు.

సమస్య తీరేదెప్పుడు.. రైతులకు న్యాయం జరిగేదెప్పుడు..

వట్లూరు భూముల సమస్యను పరిష్కరించడంలో జిల్లా అధికారులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. రైతులకు పరిహారం అందించి.. ఆ భూములను ఉపయోగంలోకి తీసుకురాని పరిస్థితి నెలకొంది. చెరువు భూములను పరిశ్రమలకు కేటాయించడం చట్ట ప్రకారం చెల్లదు. తెలిసి కూడా అప్పట్లో ఆ భూములను ఎపిఐఐసికి అప్పగించారు. రైతులు సాగులో ఉండి ఉంటే తొమ్మిదేళ్లలో వేల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగేది. దీనివల్ల ప్రభుత్వానికి, రైతులకు ఎంతగానో మేలు జరిగేది. ఎటువంటి ఆలోచన లేకుండా ప్రభుత్వం చేసిన పని కారణంగా 350 ఎకరాల సాగు భూమి బీడుగా మారిపోయింది. ఇప్పటికే రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదు. ఈ ఏడాది జనవరి 16న జరిగిన డిఆర్‌సి సమావేశంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ వట్లూరు భూముల ప్రస్తావన తెచ్చారు. దీనిపై పూర్తి వివరాలు ఇవ్వాలంటూ ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేశారు. పది నెలలు గడిచిపోతున్నా ఇప్పటి వరకూ ఏం జరిగిందో ఏ ఒక్కరికీ తెలియని పరిస్థితి నెలకొంది.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి, నేతలు

ఉపాధి హామీ బడ్జెట్ పెంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం 33వ జిల్లా మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎంఎల్‌సి గోపీమూర్తి

నవంబర్ 10, 11వ తేదీల్లో జిల్లా మహాసభ : సంఘం అధ్యక్ష కార్యదర్శులు జార్జి, సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ పెంచాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. పని దినాలు పెంచడంతోపాటు వేతన సౌకర్యం కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 33వ మహాసభ కరపత్రాలను ఆదివారం గోపీమూర్తి ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధి హామీలో అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు చూస్తుంటే ఏనుగులు దూరే కన్నాలను పూడ్చడం మానేసి ఎలుకలు దూరే కన్నాలను పూడుస్తున్న చందంగా ఉందన్నారు. ఉపాధి హామీలో ఇకెవైసి ఆధార్ అనుసంధానం, పైలట్ ప్రాజెక్టుగా కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ప్రారంభించారని తెలిపారు. ఇప్పటికే ఎన్ఎంఎంఎస్ యాప్ వల్ల ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలకు ఇకెవైసి విధానం పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టేనని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 2022 నవంబర్‌లో 32వ మహాసభ శృంగవృక్షంలో జరిగిందని గుర్తు చేశారు. 33వ మహాసభ నవంబర్ 10, 11వ తేదీల్లో అత్తిలిలో జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలో గత మూడేళ్లల్లో నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలను సమీక్షించి రానున్న కాలంలో నిర్వహించబోయే ఉద్యమ కర్తవ్యాలను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభల నిర్వహణకు జిల్లాలోని పెద్దలు, ఉద్యోగులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు సహకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, కండెల్లి సోమరాజు, జె.వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శులు బల్ల చిన వీరభద్రరావు, శేషపు అత్రియ్య, యడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

వైద్యుల ఆందోళనకు ఆశా వర్కర్స్ యూనియన్ మద్దతు

7న పిహెచ్‌సిల వద్ద నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు చేస్తున్న రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. భీమవరం సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎమ్‌డి.బేగం అధ్యక్షతన ఆదివారం జిల్లా సమావేశం నిర్వహించారు. వారం రోజుల నుంచి పిహెచ్‌సిలో పనిచేస్తున్న వైద్యులు తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న ఆందోళన న్యాయమైందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వైద్యుల సంఘంతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని సమావేశం డిమాండ్ చేసింది. ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేస్తేనే, ఉద్యోగుల ఖాళీలు భర్తీ చేస్తేనే ఇది నెరవేరుతుందని సమావేశం అభిప్రాయపడింది. జిల్లా కార్యదర్శి సిహెచ్.లక్ష్మి మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీన ఆశా డే సందర్భంగా ప్రతి పిహెచ్‌సి వద్దా ఆశా వర్కర్లకు జీతాలు పెంచాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆశా వర్కర్ల డిమాండ్ల సాధనతో పాటు వైద్యులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా ప్రతి పిహెచ్‌సి వద్దా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నవంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్ల సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధంగా ఉండాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ రాబోయే కాలంలో అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.జ్యోతి, నాయకులు లారెన్స్ కుమారి, జయంతి, వరలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు



బీచ్‌లో పర్యాటకులు

సాగర తీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్, కెపి.పాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో, ఇసుక తెన్నెలపై ఆటలాడుకున్నారు. అనంతరం ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

16 నెలలైనా హామీల అమల్లో విఫలం

- కూటమి ప్రభుత్వం తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆగ్రహం
- చలో విజయవాడకు తరలిరావాలి
- ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ ప్రకాశం పిలుపు



అభివాదం చేస్తున్న ఫ్యాప్టో నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం 16 నెలలు గడిచినా హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పిఎస్.విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాష్ విమర్శించారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల ఉద్యోగ ఉపాధ్యాయులు మండిపడుతున్నారని, సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఈ నెల 7వ తేదీన చలో విజయవాడ పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఫ్యాప్టో నేతలు సమావేశమై అభివాదం చేసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వచ్చి 16 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల విషయం పట్టించుకోకపోవడాన్ని ఖండించారు. 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సకాలంలో డిఎలు ఇస్తానన్న ముఖ్యమంత్రి నాలుగు డిఎలు బకాయి ఉన్నాయన్నారు. దసరాకు ఒక డిఎ ఇస్తారని ఎంతో ఆశతో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులను నిరాశపరిచారన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించి బోధనకు పరిమితం చేయాలని కోరారు. కో ఛైర్మన్ సాయి వర్మ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న ఉపాధ్యాయులందరూ కూడా హాజరై ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణరాజు పాల్గొన్నారు.

కొత్త బస్సులు ఏర్పాటు చేయాలి

సిబ్బందిని నియమించాలి

ఎపిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య

ప్రజాశక్తి - తణుకు

స్త్రీ శక్తి పథకం అమలు కోసం కొత్త బస్సులు ఏర్పాటు చేసి, నిధులు కేటాయింపు, సిబ్బందిని నియమించాలని ఎపిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తణుకు అమరవీరుల స్మారక భవనంలో ఎపిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా రెండవ మహాసభలు జిల్లా అధ్యక్షులు టివిఎస్.మూర్తి అధ్యక్షతన జరిగాయి. తొలుత జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందరయ్య మాట్లాడుతూ.. సిబ్బంది నియామకాలు లేకుండానే ఆగష్టు 15 నుండి స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను తొలి నుండి సమగ్రమైన అధ్యయనంతో ఎస్‌డబ్ల్యుఎఫ్ స్వాగతిస్తుందని అన్నారు. ఈ స్కీమ్ ద్వారా మహిళల ఉపాధి స్వయం నిర్ణయాలు చైతన్యం, సాధికారతకు, సాక్షరతకు అంతిమంగా రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. పథకం ప్రారంభమైన నెల రోజుల్లోనే కండక్టర్, డ్రైవర్లపై వేధింపులు, కేసులు, 60 మందికిపైగా సస్పెన్షన్లు జరిగాయని తెలిపారు. ఈ పథకం ఉద్యోగులను వేధించే పథకంగా మారకూడదని అన్నారు. కొత్త బస్సులు వేసి తక్షణమే సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వీరికి కార్మిక చట్టాలు వర్తింపచేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలను అమలు చేయాలని, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చే జిఒ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అద్దె బస్సు డ్రైవర్లకు ఒప్పందం ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని, ఆన్‌కాల్ డ్రైవర్లకు గుర్తింపు కార్డులు, కాంప్లిమెంటరీ బస్సు పాసులు ఇవ్వాలని సుందరయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సుల సాకుతో ఆర్‌టిసిలను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే చర్యలు వెంటనే ఆపాలని అన్నారు. తొలి దశలో ప్రధాన నగరాల్లోని 12 డిపోలను, రెండవ దశలో 19 డిపోలను ప్రయివేట్ విద్యుత్ బస్సు ఆపరేటర్లకు అప్పచేప్పేలా సన్నాహాలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేసి నేరుగా ఆర్‌టిసి విద్యుత్ బస్సులు నిర్వహించే అవకాశం ఇవ్వాలని అన్నారు. 12వ పిఆర్‌సి నియమించాలని, నాలుగు విడతల డిఎలను ప్రకటించాలని, డిఎ బకాయిలు ఇవ్వాలని, పేరుకుపోయిన లీవ్ ఎన్‌క్యాష్మెంటు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎఎస్.రాయుడు ప్రవేశపెట్టిన రిపోర్టు మహసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అదనపు బస్సులు వేయాలని, రిక్రూట్మెంట్లు చేపట్టాలని, లీవ్ ఎన్‌క్యాష్మెంటు, పిఆర్‌సి బకాయిలు పెండింగ్లో ఉన్న నాలుగు డిఎలు ఇవ్వాలని, స్త్రీ శక్తి పథకం అమలులో భాగంగా కేసులు ఎదుర్కొంటున్న ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని మహాసభ తీర్మానించింది. ఈ మహాసభలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర, తణుకు డిపో కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, తాడేపల్లిగూడెం డిపో సహాయ కార్యదర్శి ఆర్.ఆంజనేయులు, భీమవరం డిపో నుండి నరసింహారావు, నరసాపురం డిపో కార్యదర్శి కట్ట సత్యనారాయణ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కామన మునిస్వామి, కె.సాయికుమార్, ఎం.శ్రీనివాసు, దుర్గారావు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మట్టి తరలింపు సరికాదు

గొల్లలకోడేరు సర్పంచి లక్ష్మి, ఉప సర్పంచి శ్రీనివాస్ వర్మ ఆవేదన

ప్రజాశక్తి - పాలకోడేరు

పంచాయతీ అనుమతులు లేకుండా పంచాయతీకి చెందిన చెరువు మట్టిని తరలించకపోవడం సరికాదని గొల్లలకోడేరు సర్పంచి కుక్కల లక్ష్మి, ఉప సర్పంచి కడిదిండి శ్రీనివాస్ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. కనీస అనుమతులు తీసుకోకుండా, పంచాయతీ పాలకవర్గం సభ్యులను సంప్రదించకుండా చెరువు మట్టిని ప్రయివేటు వ్యక్తులు తరలించకపోతుంటే అధికారులు కనీసం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మట్టిని తరలించడంపై అభ్యంతరం తెలిపినా ఫలితం లేదని వాపోయారు. అధికారులు కూడా మట్టి తరలింపు చేసుకునే వారికి మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. లక్షల విలువైన మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ కనీసం అడ్డుకునే చర్యలు చేపట్టలేదని మండి పడ్డారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.



మట్టిని తరలిస్తున్న ప్రయివేటు వ్యక్తులు

చర్యలు తీసుకుంటాం : పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర కుమార్

పంచాయతీకి చెందిన చెరువు ఎప్పటినుంచో పూడికి పోయి నిరుపయోగంగా మారిందని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన ఆదేశాలతో స్థానికంగా ఉన్న ఒక పరిశ్రమ సహకారంతో చెరువు తవ్వకం పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదు వచ్చిందని దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వారి ఆదేశాలననుసరించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వేములదీవిలో విషపుటీగల గూడు..!

ఆందోళనలో స్థానికులు

తొలగించాలని అధికారులకు వేడుకోలు

ఇప్పటికే పలువురిపై ఈగల దాడి

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని వేములదీవి వెస్ట్ కాపులకొడప గ్రామంలో నివాసల మధ్య తాడి చెట్టుకు విషపుటీగల గూడు పట్టింది. విషపు టీగలు గూడు కట్టిన ప్రాంతంలో ఇల్లులు ఉన్నాయి. ఈగల వల్ల స్థానిక ప్రజలతో పాటు ఈ రోడ్డు గుండా వెళ్లే జెడ్‌పి హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులు, ప్రసిద్ధి గాంచిన శ్రీవైభవ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రమాదం ఉంది. వర్షం వచ్చినప్పుడు, గాలి వీచినప్పుడు ఈగలు ఒక్కసారిగా బయటకొచ్చి అక్కడున్న ప్రజలు, జంతువులపై దాడి చేస్తున్నాయి. దీంతో ఈగలను చూసి ప్రజలు పరుగులు పెడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు ఈగలు వచ్చి దాడి చేస్తాయోనని భయపడి బిక్కుబిక్కుమంటూ ఇళ్లలో తల దాచుకుంటున్నట్లు గ్రామవాసులు తెలుపుతున్నారు. ఇప్పటికి గ్రామ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదని వాపోతున్నారు.



వేములదీవిలో విషపు టీగల గూడు(పాతచిత్రం)

విషపు టీగల దాడి..

ఈ ఈగలు అత్యంత ప్రమాదకరమని, గతంలో ఇటువంటివి పేరుపాలెం, పిఎం లంక గ్రామంలో పశువులపై దాడి చేయగా పశువులు, మనుషులు చనిపోయాయని రైతులు చెబుతున్నారు. గత ఏడాది రుస్తుంబాద గ్రామంలో ఆకన ప్రసాద్ విషపుటీగ కుట్టడంతో అస్వస్థతకు గురై స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. గత ఏడాది గొంది గ్రామంలో ఉపాధి కూలీని ఈగలు కుట్టగా చికిత్స పొందుతూ చనిపోయారు. గత ఏడాది నరసాపురం టౌన్‌లోని ఓ దర్గాలో మామిడి చెట్టుకు విషపు టీగలు పెద్ద గూడు కట్టాయి. గత నెలలో వేములదీవి గ్రామంలో భార్య భర్తలపై ఈ ఈగలు దాడి చేయగా ఆసుపత్రిలో చికిత్స పొందారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని ఒకరిని సైతం ఈ ఈగలు కుట్టాయి.

సునామి తర్వాతే సంచారం..

2004 డిసెంబర్లో సునామి వచ్చాక తీరప్రాంతంలో ఈ విషపుటీగల సంచారం పెరిగిందని చెబుతున్నారు. గతంలో తీరప్రాంతమైన పేరుపాలెం తదితర గ్రామాల్లో ఈ విషపుటీగల గూడు తొలగింపు పనులను ఒఎన్‌జిసి సిబ్బందికి అప్పగించారు. ప్రస్తుతం వేములదీవిలోని ఈ విషపుటీగల గూడును తక్షణం తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బయటకి రావాలంటే భయం వేస్తుంది

కె.వరలక్ష్మి, గృహిణి, వేములదీవి



మా ఇంటి సమీపంలోనే ఈగలు గూడు కట్టి సంచరిస్తున్నాయి. ఇంటి వద్ద ఇస్త్రీ పని చేసుకుంటున్న నా భర్త, నాపై ఒక్కసారిగా ఈగలు దాడి చేసాయి. నరసాపురం ఏరియా ఆసుపత్రిలో రెండు రోజులు చికిత్స పొందాము. బయటకు రావాలంటే భయం వేస్తుంది. అధికారులు ఈ గూడును తొలగించేలా చర్యలు చేపట్టాలి.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి

విస్సాకోడేరులో ఘటన

ప్రజాశక్తి - భీమవరం

పిడుగుపాటుకు పాడి గేదె మృతిచెందిన సంఘటన విస్సాకోడేరులో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కారుమంచి ఎర్ర మునియ్య గేదెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల రూ.1.20 వేలు విలువ గల పాడి గేదెను కొనుగోలు చేయడం జరిగింది. సోమరాజు చెరువు దగ్గర పాడి గేదె గడ్డి మేస్తుండగా ఒక్కసారిగా పిడుగు పడింది. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న గేదె అక్కడికక్కడే మృతిచెందడం జరిగింది. ఈనేపథ్యంలో ఎర్ర మునియ్య రూ.1.20 వేలు నష్టం వాటిల్లింది. దీంతో పాడి రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు.




మృతిచెందిన పాడి గేదె


అలుకున్న నిర్లక్ష్యం..!

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పొదులు తొలగించాలని స్థానికుల వేడుకోలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలోని 7వ వార్డులో కోవెల గుడి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కల పొదులు పెరిగిపోయాయి. దీంతో సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలం కావడంతో ఏమాత్రం కొద్దిగా వర్షం పడినా సబ్ విద్యుత్ తీగలకు పొదులు తగిలి నిప్పులు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ తీగలపై పొదులను తొలగించాలని కోరుతున్నారు.


అల్లుకున్న పొదులు



చికిత్స చేస్తున్న వైద్యులు

వృద్ధులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికి వైద్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, సంఘ అధ్యక్షులు కరుణాకరచౌదరిలు తణుకు, పైడిపర్రు, మండపాక గ్రామాల్లో పర్యటించి ఆరుగురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించారు. అక్కిన కాశీవిశ్వనాథం ఆర్థిక సహకారంతో ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

7 నుండి స్కూల్ గేమ్స్ ఎంపికలు

ప్రజాశక్తి - వీరవాసరం

ఈనెల 7వ తేదీ నుండి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు జరుగుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు డి.సునీత, పిఎస్ఎన్.మల్లేశ్వరావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టేబుల్ టెన్నీస్, మాల్కాంబ్, లాన్ టెన్నిస్ గేమ్స్‌లలో ఎంపికలు జరుగుతాయన్నారు. అండర్-14, 17 బాలబాలికల విభాగాలలో టేబుల్ టెన్నీస్, మాల్కంబ్ ఎంపికలు భీమవరం చింతలపాటి బాపిరాజు మున్సిపల్ హైస్కూల్, ఫెన్సింగ్ ఎంపికలు ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వీరవాసరంలో, లాన్‌టెన్నీస్ ఎంపికలు పాలకొల్లు టౌన్‌హాల్ నందు జరుగుతాయన్నారు. ఈ ఎంపికలలో పాల్గొనే అండర్-14 బాలబాలికలు జనవరి 1వ తేదీ 2012 తర్వాత, అండర్-17 బాలబాలికలు జనవరి 1వ తేదీ 2009 తర్వాత జన్మించిన వారై ఉండి ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ చదువుతున్న వారు అర్హులు. ఐటిఐ, టెక్నికల్ కోర్సులు చదువుతున్న వారు ఈ ఎంపికలో పాల్గొనేందుకు అర్హత లేదన్నారు. ఎంపికలో పాల్గొనే బాలబాలికలు వారి స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో ఉదయం పది గంటల కల్లా రిపోర్టు చేయాలన్నారు. వివరాలకు 9100285197, 8074153923లకు కాల్ చేసి సంప్రదించాలని పేర్కొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు

దసరా ఉత్సవాలు ముగింపు

నేడు అన్నసమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెంలో ఆలయం పున: నిర్మాణం చేపట్టి గత 17 సంవత్సరాలుగా దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ బోడపాటి వెంకటేశ్వరరావు అన్నారు. జువ్వలపాలెం గ్రామంలో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం వివిధ వేష తాలాలతో ఊరేగింపు నిర్వహించారు. సోమవారం అఖండ సమారాధనను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జి.నరసింహమూర్తి, బి. రాంబాబు, బి.పెద్దిరాజు, బి.కన్నయ్య, జి.కనకం, ఎన్.శ్రీనివాస్, బి.వెంకట్, జి.దేవన్న, ఎన్.ధన, డి.సత్రాజు, బి.రాంబాబు, డి.అంజి పాల్గొన్నారు.

మొగల్తూరు : దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవార్ల విగ్రహాలను ఆదివారం ప్రత్యేక వాహనాల్లో అలంకరించి మేళ తాళాలతో భారీగా ఊరేగించారు. మొగల్తూరు పంచాయతీ సుబ్రహ్మణ్యేశ్వరం, కుక్కలవారి తోట, మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి ఉగ్గాని గారి తోట తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ప్రధాన కూడళ్లలో బాణాసంచా కాల్పులతో, మేల తాళాలు, డీజే డప్పులతో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రసాదం వితరణ చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

జీడిమెట్లకు సూపర్ లగ్జరీ బస్సు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం బస్టాండ్ నుండి జీడిమెట్లకు సూపర్ లగ్జరీ బస్ నడుస్తున్నట్లు ఆర్టీసి డిఎం సుబ్బన్నరెడ్డి తెలిపారు. నరసాపురం డిపో నుండి ప్రతిరోజూ రాత్రి 7.30కు బస్సు బయలుదేరి పాలకొల్లు, పెనుమదం, గుమ్ములూరు, ఆచంట, మార్టేరు, పెనుగొండ, తణుకు, తాడేపల్లిగూడెం విజయవాడ మీదుగా జీడిమెట్ల చేరుకుంటుందని ఆర్టీసి డిఎం సుబ్బన్నరెడ్డి తెలిపారు.

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 6వ తేదిన సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ, దాసిరాజు తెలిపారు. డివిజన్లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. సబ్ డివిజన్లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులను, దరఖాస్తులను ఉదయం 10:30 నుంచి అందించాలని కోరారు.



బీచ్‌లో వ్యక్తి గల్లంతు

పోలీసులు గాలింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కేపీ పాలెం బీచ్‌లో ఆదివారం వ్యక్తి గల్లంతయ్యాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడలోని సింగ్ నగర్‌కు చెందిన మాదేపల్లి ప్రవీణ్ కంకిపాడులోని చోళ మండలం ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. 13 మంది ఆ సంస్థ ఉద్యోగులు రెండు కార్లలో బయలుదేరి బీచ్‌కు వచ్చారు. సముద్ర అలల్లో స్నానం చేస్తూ ఉండగా అలల ఉధృతికి ప్రవీణ్ లోనికి కొట్టుకు వెళ్లి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం అవుట్ పోస్ట్ పోలీసులు, సహచరులు గాలిస్తున్నారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. ప్రవీణ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


గల్లంతైన ప్రవీణ్

మూగ రోదన వినిపించ లేదా..?

వైద్యాధికారి నియామకంలో అధికారుల నిర్లక్ష్యం
మూగజీవాలకు సకాలంలో అందని వైద్య సేవలు
ఆందోళనలో పశుపోషకులు



మండల పశు వైద్య కేంద్రం

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామీణ ప్రాంత రైతులకు పాడి పంట రెండు కళ్లలాంటివని భావిస్తూ పాడి పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. అలాంటి పాడి పశువులకు రోగం వస్తే వైద్యం చేసే దిక్కు లేదంటూ వాపోతున్నారు. లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన పశువులకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయంటూ రైతులు లబో దిబోమంటున్నారు. పాలకులకు మూగరోధన వినిపించడం లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. మండలకేంద్రమైన కాళ్లలో పశువైద్యశాలలో పూర్తిస్థాయి వైద్యులు లేక సరైన వైద్యం అందక లక్షలు విలువ చేసే మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇన్‌ఛార్జిగా ఉన్న అధికారి ఆసుపత్రికి ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత కారణంగా మూగజీవాలకు వైద్య సేవలు అందించేవారే కరువయ్యారు. కాళ్ల మండలంలో ఆవులు 2,099, గేదెలు 7,950 ఉన్నాయి. ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉండటంతో కాళ్ల పశువైద్యశాలకు రాని పరిస్థితి నెలకొంది. కాళ్ల పశువైద్యశాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న పశు వైద్యాధికారి 3 నెలల క్రితం బదిలీపై యండగండి వెళ్లారు. అప్పటి నుండి ఇప్పటి వరకు పూర్తిస్థాయి మండల పశు వైద్యాధికారిని నియమించడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారు. 3 నెలల క్రితం సిద్దాపురం వైద్యాధికారిణికి కాళ్ల, జువ్వలపాలెం పశు వైద్యశాలకు ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి నియమించారు. ఆ వైద్యాధికారిణికి సిద్దాపురం రెగ్యులర్ ఆసుపత్రితో పాటు ఐ భీమవరం, కాళ్ల, జువ్వలపాలెం పశు వైద్యశాలలో విధులు నిర్వహించాల్సి వస్తుంది. నాలుగు చోట్ల విధుల నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. దీంతో మండలకేంద్రం కాళ్లలో మండల పశువైద్యాధికారితో పాటు సిబ్బంది లేకపోవడంతో గ్రామాల్లో మూగజీవాలకు రోగాలు వస్తే అంతే సంగతులు. గత్యంతరం లేక పశు వైద్యశాలకు పారా వెటర్నరీ వర్కర్, డ్రైవర్ దిక్కుగా మారారు. దీనిపై గత సోమవారం కాళ్ల గ్రామ పాడి రైతులు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మండలకేంద్రమైన కాళ్లలో పశువైద్యశాలలో వైద్యులు లేక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో ఇన్‌ఛార్జిగా ఉన్న అధికారి ఆసుపత్రికి ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని అధికారులకు వివరించారు.


మృత్యువాత పడిన గేదె

ఇన్‌ఛార్జి ఆధీనంలో మండల పశువైద్య కేంద్రం..

కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పశు వైద్యాధికారి లేకపోవడంతో ఉన్నతాధికారులు ఆకివీడు మండలం సిద్దాపురం పశువైద్యాధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. సదరు వైద్యాధికారికి ప్రస్తుతం ఉన్నచోటే పని భారంతో ఇక్కడ ఇన్‌ఛార్జి బాధ్యతలు నెరవేర్చలేకపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశు పోషకులు అధికంగా ఉన్న కాళ్ల పశువైద్యశాలకు వైద్యాధికారి, సిబ్బంది లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది.

వైద్యం అందక పశువులు..

1962 అనేది పశువుల యజమానుల టోల్-ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా ఇంటి వద్దకే పశువైద్య సేవలను అందిస్తున్న మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌ల హెల్ప్‌లైన్. ఈ సేవలు పశువులకు అవసరమైన సకాలంలో చికిత్సను అందించడం, వాటి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. వాహనంలో వైద్యుడు, పారా వెటర్నరీ వర్కర్, సహాయక సిబ్బంది, డ్రైవర్‌తో కూడిన బృందం ఉంటుంది. వాహనంలో వైద్యుడు లేకుండానే విధులు నిర్వహిస్తున్నారు. మండల పశు వైద్యకేంద్రంలో సరైన వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇన్‌ఛార్జి సకాలంలో రాకపోవడంతో 1962 సిబ్బంది వచ్చీరాని వైద్యం చేస్తుండడంతో పశువులు మృత్యువాత పడటం పరిపాటిగా మారింది. కాళ్ల పశువైద్య కేంద్రాల్లో వైద్యుల కొరత, సకాలంలో వ్యాధి నిర్ధారణ జరగకపోవడం వంటి కారణాల వల్ల జరుగుతున్న ఒక తీవ్రమైన సమస్య. దీనివల్ల రైతులు నష్టపోతున్నారు, పశు పోషణ భారంగా మారుతోంది. వైద్యం అందక ఇటీవల నాలుగు పశువులు చనిపోయాయి. అధికారులు స్పందించి వైద్యులను నియమించాలని, పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.


ఖాళీగా ఉన్న వైద్యుని కుర్చీ

పాడి పశువులను అమ్ముకుంటున్నాం

ముత్యాల శేఖర్, పశుపోషకులు, కాళ్ల



20 ఏళ్ల నుంచి వ్యవసాయంతో పాటు పాల వ్యాపారం చేస్తున్నాను. 2 గేదెలు, 2 ఆవులు ఉన్నాయి. పశువులు అనారోగ్యానికి గురైతే డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదు. ప్రయివేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నాం. వారు కూడా సమయానికి రావడం లేదు. దీంతో పశువులు చనిపోతున్నాయి. ఏం చేయాలో తెలియక ఒక్కొక్కటిగా అమ్మేసుకుంటున్నాము. మాలాంటి పాల రైతులు పశు వైద్య సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయి వైద్యాధికారితో పాటు సిబ్బందిని నియమించి పశుసంపదను కాపాడాలని కోరుతున్నాను.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

డాక్టర్ కెల్లా భార్గవి సత్య, ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి, కాళ్ల

మండలంలో పశుపోషకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆస్పత్రిలో డాక్టర్‌తో పాటు సిబ్బందిని నియమించే విధంగా నా వంతు కృషి చేస్తా.

పంచాయతీ అధికారుల నిర్వాకం..

ప్రధాన రహదారుల వెంబడి డంపింగ్ యార్డ్స్
ప్రయాణికుల ఇబ్బంది

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు నుండి ఆచంట మండలం కోడేరు వెళ్లే రోడ్డు అంచులో వేసిన చెత్త డంపింగ్‌లో గుట్టగా ఉన్న చెత్తకు నిప్పు పెట్టడం వల్ల శనివారం రాత్రి ఈ మార్గంలో ప్రయాణించిన వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆచంట నియోజకవర్గ ప్రధాన రహదారిగా ఉన్న మండలంలోని మార్టేరు నుండి పండిత విల్లూరు, తూర్పుపాలెం గ్రామాలను కలుపుతూ ఆచంట, కొడమంచిలి, కోడేరు వరకూ ఉండే రోడ్డు మార్గంలో పరిసర ప్రాంతాలకు నిత్యం వేలాది మంది వివిధ వాహనాల్లో ప్రయాణం చేస్తుంటారు. కాగా మార్టేరుకి అర కిలోమీటర్ దూరంలో స్థానిక రెడ్డి యూత్ అసోసియేషన్, పంచాయతీ ఆధ్వర్యంలో లక్షల రూపాయలతో కైలాస వనం నిర్మించారు. ఇక్కడ ఆఖరి మజిలీ పరిపూర్ణంగా, ప్రశాంతంగా వెళ్లాలని నిర్మించిన కైలాసం వనం దగ్గర ప్రస్తుత పరిస్థితి అధ్వాన్నంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి గుండా డంపింగ్ యార్డ్‌లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండకూడదన్న అవగాహన పంచాయతీ అధికారులకు లేకుండా పోయిందని వారు వాపోయారు. ఈ పొగ వల్ల రాత్రి వేళల్లో వచ్చే, పోయే వాహనాలకు దారి కనబడక ఇబ్బంది పడుతున్నారని, అంతేకాక పొగ ఊపిరితిత్తుల్లోకి చేరడం వల్ల తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారన్నారు. జిల్లా అధికారులు ఈ పరిస్థితి పట్ల స్పందించి, వెంటనే చెత్త డంపింగ్ సమస్యను పరిష్కరించి ఈ ప్రాంత ప్రజల్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.


రహదారి పక్కన చెలరేగుతున్న మంటలు


జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

ఘనంగా కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఉండి

దళితుల ఆత్మగౌరవం, దళితులపై దాడులు, అత్యాచారాలు నుంచి కాపాడటం కోసం కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి(కెవిపిఎస్) ఆవిర్భవించిందని కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి అన్నారు. ఆదివారం ఉండి మండలం పాందువ్వ అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ 27వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాసి గోపి మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధన కోసం కెవిపిఎస్ ఏర్పడిందని, అంటరానితనం, కులవివక్ష నిర్మూలనకై కెవిపిఎస్ పోరాడుతుందని అన్నారు. దళితులందరికీ ఉపాధి, ఉద్యోగం సంక్షేమ పథకాలు, బడుగు బలహీన వర్గాల ఐక్యతకై కులాంతర వివాహం ప్రోత్సహిస్తూ ఏ కులంలో పుట్టిన వారైనా కెవిపిఎస్‌లో పని చేయవచ్చని అన్నారు. జిఒ 1235 సాధించుకున్నప్పటికీ శ్మశాన వాటిక కోసం ఇప్పటికే పోరాటాలు తప్పడం లేదని అన్నారు. మెడికల్ కాలేజీలు ప్రయివేటుపరం అయితే దళితులకే నష్టం ఎక్కువ అని కాబట్టి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ దళిత వాడలలో అభివృద్ధి శూన్యమని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో అర్జున్, కాసులు, చిట్టిబాబు, దుర్గాప్రసాద్, ప్రశాంత్, బాబురావు, మోహన్, వినయ్ పాల్గొన్నారు.

డిటిఎఒ గణేష్ సేవలు వెలకట్టలేనివి

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జేమ్స్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా డిటిఎఒగా పనిచేసి ఇటీవల ఉద్యోగోన్నతిపై తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయినా ఎ.గణేష్ సేవలు వెలకట్టలేనివని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్ అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో అసోసియేషన్ ఆధ్వర్యాన బదిలీపై వెళ్లిన గణేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జేమ్స్ మాట్లాడుతూ పెన్షనర్స్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు యూనిట్ ప్రధాన కార్యదర్శి పిఎస్.ప్రతాప్ రాజు, కోశాధికారి కెవి.కృష్ణయ్య, భీమవరం యూనిట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎయు.భాస్కరరావు, కోమల చంద్రరావు పాల్గొన్నారు.


గణేష్‌ను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు అభినందనీయం

మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

దాట్ల శ్రీదేవి మోమోరియల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు, అన్న సమారాధనలు నిర్వహిస్తున్న ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు అభినందనీయులని మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. కాళ్లకూరు వెంకటాపురంలో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా దాట్ల శ్రీదేవి మోమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. వేలాది మంది యాత్రికులకు ప్రసాదం వితరణ చేశారు. అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని వారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో యాత్రికులు విచ్చేశారు. వేలాది మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళ్లకూరు సొసైటీ అధ్యక్షులు దండు ప్రణవ మూర్తిరాజు, దాట్ల సత్యనారాయణరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, సాదు శ్రీను, లక్ష్మణ్, కమిటీ సభ్యులు ఉన్నారు.


అన్న సమారాధన నిర్వహిస్తున్న ట్రస్ట్ చైర్మన్

వాసవీక్లబ్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు


బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు

వాసవీ క్లబ్ పాలకొల్లు ఆధ్వర్యాన జిల్లా గవర్నర్ సిహెచ్ఎన్‌విఎస్ ప్రసాద్ అధికార పర్యటనలో భాగంగా 68 సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీటి విలువ రూ.5 లక్షలపైనే ఉంటుంది. పేద విద్యార్థులకు 14 సైకిల్స్, సిమెంట్ బెంచ్‌లు 10, స్కాలర్షిప్స్, వైద్య, విద్యా సహాయం ముగ్గురికి, ఆరుగురికి నిత్యావసర సరుకులు, 6 కుట్టుమిషన్లు, వాసవీ అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల 50 వేలు, 7 కెసిజీఫ్‌లు అనగా 17,500, 4 నూతన సభ్యత్వంలు నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ పాదర్తి శివ నాగేశ్వరరావు, సెక్రటరీ కె.రఘు, ట్రీసరర్ పి కొండ ప్రకాశ్, క్యాబినెట్ సెక్రటరీ సి హెచ్ వెంకటేశ్వర రావు, గాదె జనార్ధ గుప్త, మాటూరి వి వి నరసింహ మూర్తి, ఎస్ మైధిలి, కమిటీ చైర్మన్ కేవీఆర్ కే మోహన్, జిల్లా ఆఫీసర్స్ శ్రీఖకొల్లు కామేశ్వర రావు, పచ్చిగోళ్ళ మూర్తి, సభా వ్యాఖ్యాత తెలనాకుల సత్యనారాయణ, సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

నేడు స్వచ్ఛతా అవార్డుల ప్రదానోత్సవం

కలెక్టర్ సిహెచ్.నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర జిల్లా స్థాయి అవార్డులను సోమవారం ప్రధానోత్సవం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాకు రాష్ట్ర స్థాయి, 49 జిల్లా స్థాయి అవార్డులు లభించడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదగా రాష్ట్రస్థాయి అవార్డును ప్రధానం చేసిన అనంతరం జరుగుతుందని, జిల్లాస్థాయి 49వ స్వచ్ఛత అవార్డులను ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ, జిల్లా మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు చేతుల మీదగా అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. అవార్డులు పొందిన అన్ని శాఖల అధికారులు, అవార్డు గ్రహీతలు హాజరై అవార్డులను స్వీకరించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇరుకు రోడ్డుతో వాహనదారుల అవస్థలు..!

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పాతకాలవ ప్రాంతం నుండి గాంధీ బొమ్మ కూడలి మసీదు ప్రాంతం మీదుగా లాక్ పల్లవపాలెం వరకు ఉన్న రహదారి వెడల్పు తక్కువగా నిర్మించారు. దీంతో వాహనాలు ఎదురు ఎదురుగా వచ్చిన సందర్భాలలో పక్కకు తప్పుకునే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో లారీ, బస్సు ఎదురెదురుగా వచ్చిన సందర్భంలో వెళ్లేందుకు అవకాశం లేక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆ ప్రాంతం నుండి వెళ్లేందుకు వాహనదారులకు సుమారు అరగంట సమయం పట్టింది. దీంతో ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.


ఇరుకు రోడ్డులో తిరుగుతున్న బస్సులు


గోతులతో అధ్వానంగా ఉన్న రహదారి

వర్షాలతో రోడ్లు అధ్వానం

ఆదమరిస్తే అంతే..

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలో ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు తూట్లు పడ్డాయి. మండలంలోని ప్రధాన రహదారులన్నీ గోతులు మయంగా మారి వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో గోతుల పరిస్థితి తెలియక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా పెనుగొండ-మార్టేరు రోడ్డుపై భారీ గోతులు పడ్డాయి. దీంతో పలువురు ప్రయాణికులు అదుపుతప్పి రోడ్డు గోతులో పడి ఆసుపత్రి పాలవుతున్నారు. ప్రధాన రహదారులు సైతం భారీ గోతుల్లోపడి అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో మండలంలోని రోడ్లు ప్రజలకు, ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారాయి. ఈ గోతులన్నీ వర్షపు నీటితో నిండి ఉండటంతో ఏఏ ప్రాంతాల్లో గోతులు ఉన్నాయో తెలియక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రమాదకరంగా ఉన్న గోతుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారికి మరమ్మత్తులు చేపట్టాలని పెనుగొండ మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

అన్నసమారాధన అభినందనీయం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉత్సవాలు ముగింపు సందర్భంగా అన్న సమారాధన చేయటం అభినందనీయమని రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మొగల్తూరు పంచాయతీ కోట వద్ద మరి మహలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో సుబ్బారాయుడు, రామరాజులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

బండి ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో సందడి నెలకొంది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘ సభ్యులు ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్య నిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని చామకూరిపాలెం గ్రామంలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొని పలు దుకాణాలను సందర్శించి వ్యాపారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు, కొండవీటి నరసింహారావు, కొండవీటి వెంకటేశ్వరరావు చామకూరి రమేష్, పులపర్తి రమేష్, మల్లిపూడి పెద్దిరాజు, మల్లిపూడి శ్రీనివాసరావు, కొండవీటి సూర్యనారాయణ, గుబ్బల వంశీ, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

మహారాజశ్రీ భీమవరం 2nd Addl సివిల్ జడ్జి (Jr.D) వారి కోర్టులో

O.S.No. 78/2022

Between:

వాది... చింతాడ రామారావు

మరియు

ప్రతివాది... కొడవటి బాల గంగాధర తిలక్ S/o. గణపతి, D.No. 6-4-3, Harijana Doctor Street, Vivekananda Centre, Bhimavaram-1 Cell No. 93915 44447.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది అయిన మీకు దావా సమన్లు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను జారీ చేయించినప్పటికి, ప్రతివాది అయిన మీరు సదరు దావా సమన్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. సదరు దావాలో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం కోర్టు వారు ది. **24-10-2025** సం॥ తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీ **ఉదయం** గం. **10-30 ని॥లకు** ప్రతివాది అయిన మీరు పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేనియెడల సదరు దావాను ప్రతివాది అయిన మీ పరోక్షమందు తీర్మానించబడును.

దశిక మురళీకృష్ణ
అడ్వకేట్, తాడేపల్లిగూడెం

పమ్మి రాధా కిరణ్మయి
అడ్వకేట్, భీమవరం

భీమవరం
ది.05-10-2025
సెల్: 83338 28105